ఈరోజు (6 ఏప్రిల్) వామపక్ష పార్టీల విలేఖర్ల సమావేశం జరిగింది. ఆ వివరాలను ప్రచురణార్థం విడుదల చేస్తున్నాం. – జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

## యాదగిరిని గెలిపించండి, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండి
## - తిరుపతి ప్రజలకు వామపక్షాలు పిలుపు

తిరుపతి ఉప ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి నెల్లూరు. యాదగిరిని గెలిపించాలని తద్వారా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని వామపక్ష పార్టీల నాయకులు తిరుపతి ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో వామపక్షాల నాయకులు విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి.మధు మాట్లాడుతూ ఎపికి అన్ని విషయాల్లోనూ ద్రోహం చేస్తున్న బిజెపి నేడు తిరుపతి ఉప ఎన్నికల్లో పోటీ చేస్తోందని, తిరుపతి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. సిపిఎం తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి యాదగిరిని గెలిపిస్తే బిజెపి ఆగడాలకు అడ్డుకట్ట వేయవచ్చని అన్నారు. తిరుపతి ఉప ఎన్నికలను వామపక్షాలు ఒక ఉద్యమంలా భావిస్తున్నాయని, దీనిలో అన్ని వామపక్ష పార్టీలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఆర్‌పిఐ, విసికె పార్టీలు కూడా సిపిఎం అభ్యర్థిని బలపరుస్తున్నాయని అన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని దీంతో రైతు, విశాఖ ఉక్కు ఉద్యమాలకు మరింత ఊతమిచ్చినట్లు అవుతుందని తెలిపారు. టిడిపి బిజెపిపై ఒక్క విమర్శకూడా చేయకుండా తిరుపతిలో ప్రచారం చేస్తోందని, ప్రజలు దీన్ని గమనిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ మతోన్మాద, ప్రైవేటీకరణ విధానాలతో ప్రాంతీయ పార్టీలు తమ మనుగడను కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇప్పటికైనా కేంద్రానికి వ్యతిరేకంగా పార్టీలన్నీ ముందుకు రావాలని కోరారు. తిరుపతి ఉప ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిని గెలిపించి లౌకికతత్వాన్ని నిలబెట్టాలని కోరారు.

ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు పివి.సుందరరామరాజు మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థి యాదగిరిని వామపక్ష పార్టీలన్నీ బలపరుస్తున్నాయని, తమ పార్టీ కూడా సంపూర్ణంగా బలపరుస్తుందని అన్నారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు యాదగిరిని గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంసిపిఐ(యు) నాయకులు కాటం.నాగభూషణం మాట్లాడుతూ బిజెపి బుకాయింపులతో కాలం గడుపుతోందని, దీన్ని ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. ఎపికి విభజన హామీలన్నీ అమలు చేశామని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నష్టాల్లో నడుస్తోందని బుకాయిస్తోందని, ఇటువంటి బిజెపికి తిరుపతి ప్రజలు ఉప ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఎస్‌యుసిఐ(సి) నాయకులు బిఎస్ అమర్‌నాథ్ మాట్లాడుతూ బిజెపి ఫాసిస్టు విధానాలు దేశంలో శరవేగంగా అమలవుతున్నాయని అన్నారు. వాటిని అడ్డుకోవాలంటే వామపక్షాల అభ్యర్థిని గెలిపించి పార్లమెంటుకు పంపాలని తిరుపతి ప్రజలకు పిలుపునిచ్చారు.

సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ దేవుడి పేరుచెప్పి బిజెపి తిరుపతి ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. ఓట్లు రాబట్టుకునేందుకు మతతత్వ రాజకీయాలకు పాల్పడుతోందని, తిరుపతి ప్రజలు బిజెపిని నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. బిజెపి చేస్తున్న రాజకీయం సరైంది కాదని, తిరుపతి ప్రజలంతా సిపిఎం అభ్యర్థి యాదగిరికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు డి.హరినాథ్ మాట్లాడుతూ బిజెపి చెబుతున్న అబద్ధాలకు తిరుపతి వెంకన్న అయోమయంలో పడే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి బుద్ధి చెప్పేందుకు తిరుపతి ప్రజలకు అవకాశం వచ్చిందని, బిజెపిని చిత్తు చిత్తుగా ఓడించాలని కోరారు. సిపిఎం అభ్యర్థి యాదగిరిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశానికి హాజరుకాలేని ఆర్ఎస్‌పి, ఆర్‌పిఐ, విసికె పార్టీలు తమ మద్దతును ప్రకటించాయి. విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, ఎంసిపిఐ యు నాయకులు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

= = = =